క్లుప్తంగా

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



జి.కొత్తపల్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

శంఖవరం: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, దానికి అనువైన పంటలు వేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి, ఎస్.జగ్గంపేట, అచ్చంపేట గ్రామాల్లో ఆదివారం భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించారు. భూసార పరీక్షల అనంతరం రైతుల ఆయా భూముల్లో ఏఏ పంటలు వేయాలో తెలియజేస్తామన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులు ఈనెలాఖరులోకు స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటను బాగు చేయండి సారూ..

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన జల్దాం శివారు గిన్నిలారం గ్రామానికి వెళ్లే కాలిబాటను బాగు చేయాలని గిరిజనలు కోరుతున్నారు. సుమారు 150 మంది జనాభా ఉన్న గ్రామానికి రహదారి సదుపాయం లేక కొండ ప్రాంతంలోని కాలిబాటలోనే ప్రయాణం చేస్తున్నారు. గిరిజనులు పండించే పంటలు విక్రయించుకోవడానికి, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకోవడానికి ఈ కాలిబాటలోనే ప్రయాణం సాగించాలి. ఈ కాలిబాటకు ఇరువైపులా దట్టమైన పొదలు, కొమ్మలు ఏపుగా పెరిగి రహదారిని మూసివేసింది. దీంతో ఆ ప్రాంతంలో ప్రయాణం దినదిన గండంగా మారిందని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కాలిబాటను బాగు చేయాలని కోరుతున్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

తుని రూరల్: మండలం హంసవరంలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ విద్యాలయం (ఏపీ మోడల్ స్కూల్) ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మజ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 11న పరీక్ష నిర్వహించామన్నారు. ఫలితాల వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు సోమవారం నుంచి ఆధార్ కార్డు, ఐదో తరగతి స్టడీ సర్టిఫికెట్ల జెరాక్స్‌ను పాఠశాలలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలని సూచించారు.

మోటారు సైకిళ్ల చోరీపై కేసు

గండేపల్లి: మోటారు సైకిళ్ల చోరీపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గండేపల్లి గ్రామానికి చెందిన ఉప్పులూరి శ్రీనివాస్ తన మోటారు సైకిల్‌పై ఈ నెల 14న రంగంపేట రోడ్డులోని పొలం పనికి వెళ్లాడు. తొలుత బైక్‌ను రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. పొలం పని ముగించుకుని తిరిగి వచ్చే సరికి మోటారు సైకిల్ కనిపించలేదు. పలు చోట్లు వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే యల్లమిల్లి గ్రామానికి చెందిన పులపకూర చంద్రరావు తన మోటారు సైకిల్‌ను ఈ నెల 13న యల్లమిల్లి శివారు రంగంపేట వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసి పనిముగించుకుని వచ్చేసరికి మోటారు సైకిల్ కనిపించ లేదు. పలు చోట్ల వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి, జగ్గంపేట శివారు ప్రాంతాల్లో పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.10600 స్వాధీనం చేసుకున్నట్టు ఏఎస్‌ఐ నూకరాజు తెలిపారు. కాట్రావులపల్లిలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.7000, జగ్గంపేట శివారులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.3600 స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. నిందితులపై కేసులు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఉప్పలపాడులో మరో ఆరుగురు..

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.1200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గాలికుంటు నివారణకు చక్కటీ కార్యాచరణ

- వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు తప్పనిసరి
- పశువుల మకాలకు వెళ్లి టీకాలు వేస్తున్న సిబ్బంది
- తొలకరిలో పాడి పశువులకు వ్యాధులు రాకుండా చర్యలు



బెండపూడిలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

తొండంగి: తొలకరిలో పాడి పశువులకు వచ్చే ప్రాణాంతక గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం చక్కటి కార్యాచరణను సిద్ధం చేసింది. గ్రామాల్లో పాడి పశువులున్న ప్రతి ఇంటికీ వెళ్లి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేసేందుకు తగిన ఏర్పాట్లు చేసింది. గతంలో పశుగణన ద్వారా అన్ని పాడి పశువులకు చెవి ట్యాగ్‌లు వేసి ప్రత్యేకంగా ఆధార్ నంబర్లు కేటాయించారు. విడతల వారీగా అన్ని పాడిపశువులకు వ్యాక్సిన్లు వేస్తారు. పాడి రైతులు పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని బెండపూడి పశువైద్యాధికారి బి.చైతన్య సూచించారు.

పశువుల వివరాలు

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులు, పాల వ్యాపారంపై ఆధారపడి వేల సంఖ్యలో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను సైతం అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 2.82 లక్షలు గేదెలు, 75 వేలు ఆవులు ఉండగా తొండంగి మండలంలోని 26 వేల పశువులు ఉన్నాయి. మేకలు, గొర్రెలు మరో 33 వేల వరకూ ఉన్నాయి.

వ్యాధికి గల కారణాలు

తొలకరి వర్షాలు పడినప్పుడు పాశ్చురెల్లా హిమోలైటికా బ్యాక్టీరియా వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. దీనినే గొంతు వాపు వ్యాధి, గురక జబ్బు, కంఠ మాద, ఎర్రదొమ్మ, కుత్తుక వాపు, గురక తెగులు అని పిలుస్తారు. ఈ వ్యాధి ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాపిస్తుంది. వాతావరణ మార్పులతో పాటు అపరిశుభ్ర నీరు, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉండటం వంటి కారణాలతో ఈ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా రెండు నుంచి నాలుగు సంవత్సరాల పశువులకు ఈ వ్యాధి వస్తుంది.

వ్యాధి వ్యాప్తి

తాగునీరు, కలుషిత వాతావరణం, అనారోగ్య పశువుల స్పర్శ, మేత, పరికరాలు, ఈగలు, జోరీగల ద్వారా ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా వర్షాలకు నిలిచిపోయిన మురుగునీరు, అపరిశుభ్ర పశువుల పాకలు, వాటి పరిసరాలు ఈ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారకాలు. ఈ వ్యాధి ముఖ్యంగా శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. పశువుల గొంతు, మెడ కింద భాగంలో వాపు కనిపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

మేత, నెమరు మందగించుట, పాలు తగ్గిపోవుటం, గొంతు కింద భాగంలో వాపు ప్రారంభమై క్రమంగా మెడ కింద భాగానికి, ఆ తర్వాత కాళ్ల మధ్య ఎదురు రొమ్ము కిందకు చేరుతుంది. పశువు తీవ్రమైన ఆయాసంతో రొప్పుతూ గురక పెడుతుంది. ముక్కు నుంచి, నోటి నుంచి నురగ కారుతుంది.

వ్యాధి నిర్ధారణ, చికిత్స

పశువుల రక్త నమూనాలను సేకరించి పరీక్షలు చేయడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చు. సకాలంలో సరైన చికిత్స అందించడంతో పాటు టీకాలు వేయడం వంటి నివారణ చర్యలు తీసుకోవాలి. ఈ వ్యాధికి గురైన పశువులకు బాగా విశ్రాంతిని ఇవ్వాలి. రోజుకు నాలుగైదు సార్లు సాంబ్రాణి దూపం వేసి పశువులు పీల్చుకునేలా చేస్తే ఉపశమనం కలుగుతుంది. ఎన్రోఫ్లాక్సిసిన్ సిప్రోఫ్లాక్సిసిన్ జెంటామైసిన్, సల్ఫా పెన్సిలిన్ వంటి ఏదైనా యాంటీ బయోటిక్ ఇంజక్షన్లను వరుసగా కనీసం 3, 4 రోజులు ఇవ్వాలి.

నివారణ చర్యలు

ఈ వ్యాధికి గురైన పశువును గుర్తించగానే మిగతా పశువులకు దూరంగా ఉంచాలి. పశువుల పాకల్లోకి క్రిమికీటకాలు చేరకుండా శుభ్రంగా ఉంచాలి. పాడిసున్నం, గెమాక్సిన్, డీడీటీ, సైపర్ మెత్రిన్, డెల్టామెత్రిన్ వంటి కీటక నాశకాలను స్ప్రే చేయాలి. చనిపోయిన పశువుల కళేబరాలను, వాటి వ్యర్థాలను భూమిని లోతుగా తవ్వి పాతిపెట్టాలి. వర్షాకాలం రాగానే పశువుల్లో గొంతు వాపు వ్యాధి రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి.

ముందుగానే వ్యాక్సిన్ వేయించాలి



పాడి పశువుల్లో గొంతువాపు వ్యాధి రాకుండా రైతులు ముందుగానే టీకాలు వేయించాలి. అన్ని రైతు భరోసా కేంద్రాలు, పశువుల ఆస్పత్రుల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్లు పశువులున్న ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్లు వేస్తున్నారు. ప్రతి పశువుకు కచ్చితంగా ఈ ప్రాణాంతక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలి.

– బి.చైతన్య, పశువైద్యాధికారి బెండపూడి, తొండంగి మండలం



గొర్రెలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ డాక్టర్ చైతన్య

అందరికీ రక్షిత తాగునీరు



జి.కొత్తపల్లిలో పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

శంఖవరం: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం జలజీవన్ మిషన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి రక్షిత తాగునీరు అందిస్తామని చెప్పారు. పైప్‌లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

లిబరేషన్ నేత చక్రం మృతి



నెల్లి చక్రం ఫైల్

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతల్లూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నేత నెల్లి చక్రం (68) ఆదివారం మృతి చెందారు. గతకొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఆరోగ్యం మరింత క్షీణించడంతో మృతి చెందారు. ఆయన పలు ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారు. ఆయన మృతికి లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు, జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, పార్టీ నాయకుడు తాడి నాగేశ్వరరావు తదితరుల సంతాపం తెలిపారు.

తాళ్లూరులో జోరుగా మట్టి తవ్వకాలు

- ట్రాక్టర్లపై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



తాళ్లూరులో జేసీబీతో పోలవరం మట్టిని తవ్వుతున్న దృశ్యం

గండేపల్లి: తాళ్లూరులోని పుష్కర, పోలవరం కాలువలు, ఆయకట్టు చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అక్రమార్కులు రాత్రీ, పగలూ తేడా లేకుండా మట్టి తవ్వకాలు సాగిస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంతో స్థానికులు పలు ఆరోపణలు చేస్తున్నారు. కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారం మట్టిని తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. మట్టి తరలించేందుకు అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా రాత్రి సమయాల్లో మట్టిని అక్రమంగా ట్రాక్టర్లు, టిప్పర్ లారీలపై తరలిస్తున్నారు. ట్రాక్టర్లు, లారీలు మట్టి లోడుతో అతివేగంగా వెళ్లడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తాళ్లూరు గ్రామశివారు ఇటుక బట్టీకి సమీపంలో గల పోలవరం కాలువ మట్టిని ఉప్పలపాడుకు చెందిన ఓ వ్యాపారి యంత్రాల సహాయంతో తవ్వి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేసవి కాలం కావడంతో జనం ఇంటి బయట, మేడపైన పడుకుంటున్నారు. కాగా రాత్రి సమయాల్లో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీల నుంచి వస్తున్న శబ్దానికి నిద్ర పట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సన్ డే..



ఎండకు నిర్మానుష్యంగా మారిన జగన్నాథగిరి హైవే జంక్షన్



నిర్మానుష్యంగా మారిన ప్రత్తిపాడు మెయిన్ రోడ్డు

తుని రూరల్: వేసవి ఉష్ణోగ్రతలు తగ్గకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. కొద్ది రోజులుగా తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం సైతం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో గ్రామీణులు తల్లడిల్లిపోయారు. వివిధ పనులపై బయటకు వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శనివారం రాత్రి వర్షం కురిసినప్పటికీ ఆదివారం చల్లదనం కానరాలేదు. ఉదయం 7 గంటల నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు బయటకురాని పరిస్థితి నెలకొంది. భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు అవస్థలు పడ్డారు. ప్రయాణికులు, వాహనదారులు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ తగ్గిపోయింది. లోవ భక్తులు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే జగన్నాథగిరి హైవే జంక్షన్ నిర్మానుష్యంగా మారింది.

ఉక్కపోతతో విలవిల

తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున ఓ మోస్తరుగా వర్షం కురిసినప్పటికీ ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువైంది. పది గంటలకు రోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఇళ్లలో ఉక్కపోతకు గురై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు లో వోల్టేజీ సమస్యతో గృహాల్లో ఏసీలు, ఫ్యాన్లు పనిచేయకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలతో సహా ప్రజలు అవస్థలు పడ్డారు. మరికొద్ది రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రత్తిపాడు: ఉదయం సూర్య భగవానుడి ప్రతాపానికి అల్లాడిన జనం సాయంత్రమయ్యే సరికి కాస్త ఊపిరి పీల్చుకున్నారు. శనివారం వాతావరణం కాస్త చల్లబడినప్పటికీ సూర్యభగవానుడు ఆదివారం తిరిగి తన ఉగ్రరూపం ప్రదర్శించాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 11 గంటల నుంచే రహదారులు, వీధులు నిర్మానుష్యమయ్యాయి. ఉదయం నుంచీ తరచూ కరెంటు కోతలు విధించడంతో ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం మూడు గంటలకు ఓ పక్క ఎండ వేడిమి కొనసాగుతుండగానే హఠాత్తుగా కొద్దిసేపు వర్షం కురిసింది. ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు అమరయ్య ఘనపాఠి, యనమండ్ర శర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. తాటిపర్తి అపర్ణాదేవి ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకర శాస్త్రితో పాటు 50 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

20న అన్నవరానికి బొమ్మి ఇజ్రాయిల్



కొత్తకొట్టాంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాదిగలు

కోటనందూరు: ఎమ్మెల్సీగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన బొమ్మి ఇజ్రాయిల్ ఈ నెల 20న అన్నవరం వస్తారని, మాదిగలందరూ భారీగా తరలి వచ్చి ఆయనకు ఘనస్వాగతం పలకాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే పిలుపునిచ్చారు. మండలంలోని పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, కొత్తకొట్టాం, కేపీ మల్లవరం, కొత్తకొట్టాం, ఎల్లీపేట, భీమవరపుకోట గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. తొలుత ఆయా గ్రామాల్లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాదిగలతో సమావేశాలు నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి మాదిగులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. వైఎస్సార్ సీపీలో కీలకమైన పదవులను మాదిగలకు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అన్నవరంలో ఇజ్రాయిల్ మాదిగలను సంఘటితం చేసి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పాల్గొంటారని చెప్పారు. మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు దళిత, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయాలంటూ ర్యాలీ



రంపయర్రంపాలెంలో ర్యాలీ చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

గోకవరం: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క, మోహన్ బైరాగిలతో పాటు పలువురుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన ఉపా చట్టం కేసులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంపయర్రపాలెంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన కలాన్ని, గళాన్ని ఉపయోగించి పోరాడుతున్న వారిపై ఉపా చట్టం కింద కేసులు మోపడం బాధాకరమన్నారు. దేశంలో దళిత మహిళలు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఇప్పటికైనా విమలక్క, మోహన్ బైరాగిలపై పెట్టిన కేసులు కొట్టేయకుంటే మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, వల్లూరి రాజబాబు, రమేష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

25న రాజ్యాంగ విలువల పరిరక్షణపై సదస్సు



ప్రత్తిపాడులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐలాజ్ కేంద్ర కమిటీ సభ్యుడు శివ

ప్రత్తిపాడు: విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 25న ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) ఆధ్వర్యంలో ×రాజ్యాంగ విలువల పరిరక్షణ – న్యాయవాదుల పాత్ర¥ అన్న అంశంపై సమావేశం ఏర్పాటు చేసినట్టు ఐలాజ్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత శివ తెలిపారు. ప్రత్తిపాడులో ఆదివారం ఉదయం ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు, నియమాలు, విధానాలు, కార్యనిర్వాహక సంప్రదాయాలు, కోర్టు తీర్పుల ద్వారా న్యాయం వ్యక్తమవుతుందన్నారు. రాజ్యాంగ ప్రాథమిక అస్తిత్వానికే సవాళ్లు ఎదురైనపుడు మనం ఏమి చేయాలనే ప్రధాన అంశంపై చర్చించేందుకు ఐలాజ్ ఆంధ్రప్రదేశ్ విభాగం ఈ సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. ఐలాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, కర్నాటక హైకోర్టు న్యాయవాది క్లిఫ్టన్ డి. రొజోరియో ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఐలాజ్ కమిటీ సభ్యులు బండారు నరసింహరావు, కొత్తం అనూహ్య, కందా వెంకట్రాజు పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మతల్లి

అన్నవరం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో కొలువైన మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారిని మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకూ గ్రామంలో ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ డ్యాన్స్‌లు, కళాప్రదర్శనలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. ఉదయం పండితులు అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. యాళ్ల శివ, శ్రీనివాస్ సోదరులు రూ.20 వేల విలువ చేసే బంగారు ఆభరణాన్ని అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- మాజీ ఎంపీ తోట నరసింహం
- ఇటికాయలపల్లిలో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తోట నరసింహం

గోకవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందని మాజీ ఎంపీ తోట నరసింహం అన్నారు. మండలంలోని ఇటికాయలపల్లిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 2004, 2009, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పని చేశానన్నారు. ఆ సమయంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేశానన్నారు. 2009లో తాను గెలుపొందడానికి గోకవరం మండలం ప్రధాన కారణమన్నారు. మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించిన మహోన్నత వ్యక్తి వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నారు. ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా గోదావరి జిలాలు ఈ ప్రాంతానికి తీసుకువచ్చి గోకవరం మండలాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. ఆయన తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఆయన తనయుడు తోట రాంజీ, నాయకులు దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, కొల్లాటి రామకృష్ణ, సమ్మెటి నాని, పెద్దాడ వెంకన్నదొర, బద్దిరెడ్డి సుబ్బారాయుడు, అత్తులూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బోర్ల వైర్లు చోరీ

తొండంగి: ప్రస్తుత పంట విరామ కాలం దొంగలకు వరంగా మారింది. వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్నారు. మెయిన్ లైన్ సర్వీసు నుంచి బోరు మోటార్లకు వేసిన త్రీ ఫేజ్ విద్యుత్ వైర్లను అమర్చుతారు. మండలంలోని కోదాడ, శృంగవృక్షం, శృంగవృక్షంపేట గ్రామాల్లో గత పది రోజుల వ్యవధిలో సుమారు 20 బోర్ల నుంచి విద్యుత్ వైర్లు దొంగిలించారని రైతులు వాపోతున్నారు. గతంలో కొమ్మనాపల్లి, సీతారాంపురం గ్రామాల్లో కూడా బోర్లు నుంచి విద్యుత్ వైర్లను చోరీ చేశారు. కొందరు ముఠాగా ఏర్పడి ఈ చోరీలకు పాల్పడుతున్నారని రైతులు చెబుతున్నారు. పోలీసులు దీనిపై దృష్టి సారించి విద్యుత్ వైర్లు చోరీ చేసిన దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.